# పర్యాటక కొండ.. ఉండ్రుగొండ



ఆలయం ముందు ఉన్న అందమైన కోనేరు

## ఎటుచూసినా కొండలు.. అల్లుకున్న పచ్చదనం

**అబ్బురపరిచే పురాతన కట్టడాలు**

**ఆధ్యాత్మిక నిలయం ఉండ్రుగొండ ఆలయం**

**గుట్టలపై పొడవైన కోట గోడలు, చారిత్రక ఆనవాళ్లు, అద్భుత కట్టడాలు**

**ఫొటో షూట్‌లు, షార్ట్ ఫిల్మ్‌లు, ప్రీవెడ్డింగ్ వీడియోల చిత్రీకరణ**

ఎత్తైన నల్లని కొండలు.. విస్తారంగా పరుచుకున్న పచ్చని దట్టమైన అడవి, బలిష్టమైన దుర్గా ప్రాకారాలు, ఈత కొలనులు.. చారిత్రక కట్టడాలు, పొడవైన కోట గోడలు, రమణీయ వాతావరణంతో ఉండ్రుగొండ గుట్టలు కనువిందు చేస్తున్నాయి. గిరి దుర్గంలో కొలువై ఉన్న లక్ష్మీనర్సింహస్వామి ఆలయం ఆధ్యాత్మిక నిలయంగా పేరొందింది. స్వామి వారిని దర్శించుకున్నవారు ప్రకృతి అందాలను తిలకించకుండా ఇక్కడి నుంచి వెళ్లరు. ప్రకృతి అందాలను తిలకించేందుకు కుటుంబ సభ్యులతో కలిసి, యువకులు, ప్రకృతి ప్రేమికులు, పర్యాటకులు అధికంగా వస్తుంటారు. ఇక్కడ తరచూ ఫొటో షూట్‌లు, షార్ట్‌ఫిల్మ్‌ల చిత్రీకరణ జరుగుతుంటాయి.

– చివ్వెంల, సెప్టెంబర్ 30

*సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం ఉండ్రుగొండ గుట్టల్లో ఉన్న లక్ష్మీనర్సింహస్వామి ఆలయం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నది. ఈ ఆలయం హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారి 65పై సూర్యాపేట జిల్లా కేంద్రానికి 12కిలోమీటర్ల దూరంలో ఉన్నది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. ఇక్కడ ఫొటో షూట్‌లు, షార్ట్ ఫిల్మ్‌లు, ప్రీ వెడ్డింగ్ షూటింగ్‌లు నిత్యం జరుగుతున్నాయి.*

### ఉండ్రుగొండ గిరిదుర్గం చరిత్ర..

ఉండ్రుగొండ గిరి దుర్గం సుమారు 6వేల ఏండ్ల పురాతనమైందని పురావస్తు శాఖ ధ్రువీకరించింది. ఆరో శతాబ్దంలో చాణిక్యులు, 8, 9వ శతాబ్దంలో కళ్యాణ చాణిక్యులు, విష్ణు కుండీనులు, 400ఏండ్ల తర్వాత రేచర్ల పద్మ నాయకులు, రెడ్డి నాయకులు ఉండ్రుగొండను కేంద్రంగా చేసుకుని పరిపాలన సాగించినట్లు చరిత్ర చెబుతుంది. కాకతీయుల కాలంలో రాణి రుద్రమదేవి, శ్రీకృష్ణ దేవరాయలు, కుతుబ్ షాహీ, అసబ్ షాహీ (గోల్కొండ నవాబులు) ఈ ప్రాంతాన్ని సామంత రాజుల సహాయంతో ఏలినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. (బ్రిటీష్ ఆర్కియాలజిస్ట్ రాబర్ట్ స్టీవెల్ 1882 వాల్యూ నెంబర్ –1, పేజీ 46లో ఉండ్రుగొండ గురించి రాసినట్టు ఇండోలాజికల్ బుక్ హౌజ్ ఢిల్లీ వారి ప్రచురణలో పేర్కొనబడింది). ఉండ్రుగొండ గిరి దుర్గం ఎనిమిది కొండలు కలుపుతూ ఉంటుంది. 15 అడుగుల ఎత్తయిన రాతి ప్రాకారము, 10 అడుగుల వెడల్పు, రెవెన్యూ అధికారుల లెక్కల ప్రకారం సుమారు 14 కిలోమీటర్ల పొడవైన కోట గోడ, 14 వందల ఎకరాల విస్తీర్ణం ఉండడం గమనార్హం. కోట గోడకు 18 దర్వాజలు వివిధ రూపాల్లో వివిధ అవసరాలకు నిర్మింపబడి ఉన్నాయి. శిలా శాసనాలు, రాగి పలకలపై ఉన్న శాసనాలు, తాంత్రిక ముగ్గులు, వివిధ దేవతా ప్రతిరూపాలు, రేఖా చిత్రాలు నాటి కాలమానాన్ని కొంతవరకు దార్శనికం చేస్తాయి. ఇక్కడ కనిపించే రాక్షస గూళ్లు ఆదిమ జాతి మానవుడి మనుగడను సూచిస్తాయి. ఈక్ష్వాకులు క్రీస్తు పూర్వం 1వ శతాబ్దం నుంచి క్రీస్తు శకం రెండో శతాబ్దం వరకు పాలించినట్లుగా ఇప్పుడున్న గంగ మల్లికార్జునస్వామి దేవాలయంపై ఉన్న తాంత్రిక ముగ్గులు, క్రీస్తు శకం ప్రారంభంలో ఉన్న కాలయ వనుల కాలంనాటి గుర్తులు, రుషుల మఠాలు దర్శనమిస్తున్నాయి. విష్ణు కుండీనుల పాలనకు గుర్తుగా ఉన్న వివిధ వైష్ణవ ఆలయాలు, మండపాలు శిథిలమై ఉన్నాయి. అష్టదిక్కుల్లో ఎనిమిది కాలభైరవ ప్రతిమలు, కోట చుట్టూ ఆంజనేయస్వామి విగ్రహాలు ఉన్నాయి.

### అలరిస్తున్న హ్యాంగింగ్ స్టోన్స్


లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి ఆనుకొని తూర్పు గుట్టకు ఆలయం పైన ఉన్న హ్యాంగింగ్ స్టోన్స్ (వేలాడుతున్న రాళ్లు) అత్యంత అద్భుత దృష్యాల్లో ఒకటిగా చెప్పొచ్చు. స్వామివారి దర్శనానికి వచ్చిన ప్రతి భక్తుడూ వీటిని చూస్తూ అలా ఉండి పోతుంటారు. వాటిని చూస్తుంటే మీద పడుతాయేమోనన్న సందేహం కలుగుతుంది. నిటారుగా ఉన్న కొండకు రాళ్లను ప్రత్యేకంగా అతికించినట్టుగా వేలాడుతూ ఉండడం మరో ప్రత్యేకత.

### షార్ట్ ఫిల్మ్‌లు, ప్రీవెడ్డింగ్ ఫొటోగ్రఫీ షూటింగ్

ఎంతో ప్రసిద్ధి చెందిన ఉండ్రుగొండ గుట్టల్లో షార్ట్ ఫిల్మ్, ప్రీ వెడ్డింగ్, ఫొటో షూటింగ్ కోసం జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి నిత్యం ఇక్కడకు వస్తుంటారు. అక్కడున్న ప్రతి లోకేషన్ అద్భుతంగా ఉండటమే కాకుండా షూటింగ్‌లకు అనుకూలంగా ఉండటంతో యువకులు అధికంగా వస్తున్నారు. ఈ గుట్టను ఒక్కసారి సందర్శిస్తే మరోసారి స్నేహితులతో లేదా కుటుంబ సభ్యులతో సందర్శించాలనుకుంటారు.

### అద్భుతంగా రాతి మంటపం

కోట పైభాగంలో వంపు ప్రదేశంలో నిర్మితమైన రాతి మంటపాన్ని అత్యంత అద్భుతంగా నిర్మించారు. మంటప నిర్మాణంలో ఉపయోగించిన స్తంభాలు అతికించడానికి ఎటువంటి మిశ్రమం వాడకుండా ఏక స్తంభంపై మరో స్తంభం నిలబెట్టిన విధానం అబ్బురపరుస్తుంది. ఎత్తయిన కొండల మీద శిలలను తొలిచి అందమైన రాతి శిల్పాలుగా మలుచడానికి వారు పడిన శ్రమ మంత్ర ముగ్ధుల్ని చేస్తుంది.



కొండపైన ఉన్న మండపం



కొండపైన ఉన్న కొలను


### గుట్ట చుట్టూ అనేక శిల్పాకృతులు

ఆలయం ముందున్న కోనేరులో గజేంద్ర మోక్షం తలపించు కరి–మకరుల ఆకృతులు, ఆలయం వెనుక భాగాన ఆదిశేష అవతారం, కోనేరు ఒడ్డున కూర్మావతారం, ఆలయానికి వచ్చే దారిలో ఎస్సారెస్పీ కాల్వ (జాతీయ రహదారి 65) దగ్గర నుంచి చూస్తే హిరణ్యకశపుని సంహారం తర్వాత విశ్రాంతి తీసుకుంటున్నట్టుగా ఉన్న శయన నరసింహస్వామి, సహజ శిల్పాకృతులు ఉన్నాయి. గుహలు, ఆంజనేయస్వామి, కాలభైరవ విగ్రహాలు, కోట గోడలు, గుట్ట పైనుంచి దేవాలయం వెనుక భాగం అనుకొని ఉన్న గుట్ట మీద వేలాడుతున్నట్టుగా ఉండే గుండ్లు (హ్యాంగింగ్ స్టోన్స్), చారిత్రక శిథిలాలు ఉన్నాయి. మంత్రి బావి, చాకలిదాని పడిగ, సింగరేణి కుంట, కోనేర్లు ఇప్పటికీ నీటితో కళకళ లాడుతున్నాయి. బోగం దాని గద్దె, పందెం బావి, కేపిరాయిని కుంట, నాయినివారి బావి, ఏనుగుల దర్వాజ, పీనుగుల దర్వాజ, నాగులపహాడ్ దర్వాజ, మల్లయ్యస్వామి గుడి, రుషుల మఠం, పహారా, గోపాలస్వామి గుడి, గుట్ట చుట్టూ 18 ఆంజనేయస్వామి విగ్రహాలు రామాలయ స్థలం, శంఖం, చక్రం, మూల దర్వాజ, జాలు దర్వాజలు ఉన్నాయి. భారతదేశంలో ఏ గుట్టపైనా లేని విధంగా ఇక్కడ గుట్ట పైన నీరు నిల్వ ఉండడం ఉండ్రుగొండకున్న ప్రత్యేకత. ఎన్నో విశిష్టతలు కలిగిన ఈ గుట్ట 2002లో వెలుగులోకి వచ్చింది.




వీడియో షూటింగ్ దృశ్యం (ఫైల్)

ఉమ్మడి రాష్ట్రంలో 2002 సంవత్సరంలోనే ఇది వెలుగులోకి వచ్చినప్పటికీ అప్పటి పాలకులు పట్టించుకోకపోవడంతో ఏ మాత్రమూ అభివృద్ధి జరుగలేదు. స్వరాష్ట్రంలో ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాలు నిర్వహించడంతోపాటు నిత్య పూజలు జరుగుతున్నాయి. ఆలయం వద్దకు వెళ్లేందుకు ఘాట్ రోడ్డు నిర్మాణం పూర్తయింది. భక్తుల కోసం ప్రజా మరుగుదొడ్లను నిర్మించారు. ఆలయం వద్ద మినీ ఫంక్షన్ హాల్, ఆలయం ఎదుట ఉన్న కోనేరుకు మెట్లు ఏర్పాటు చేశారు.



కొలిమి సావిడి



దట్టమైన అడవితో ఉండ్రుగొండ గుట్టలు

# మంత్రి కేటీఆర్ పర్యటనకు చకచకా ఏర్పాట్లు

## రేపు నల్లగొండ, సూర్యాపేటలో మంత్రి కేటీఆర్ పర్యటన



**మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి ఐటీ హబ్‌లు, అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం**

**కోట్లాది రూపాయల పనులకు శంకుస్థాపన**

**ఎన్‌జీ కాలేజ్‌లో ప్రగతి నివేదన సభ**

**ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి**

**పర్యటన, సభను విజయవంతం చేయాలని పిలుపు**

రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ సోమవారం నల్లగొండ జిల్లాకు వస్తున్న సందర్భంగా అధికార యంత్రాంగం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నది. నల్లగొండ నియోజకవర్గాన్ని దత్తత తీసుకున్న సీఎం కేసీఆర్ సుమారు రూ.1200 కోట్లతో పట్టణ సుందరీకరణ చేపట్టిన విషయం తెలిసిందే. అందులో ఇప్పటికే పలు పనులు ప్రారంభం కాగా.. అక్టోబర్ 2న మంత్రి కేటీఆర్ మరో రూ.250 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. మరో 663 కోట్ల రూపాయల పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. ఇందుకోసం జిల్లా అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నది. అనంతరం ఎన్జీ కళాశాల మైదానంలో బీఆర్ఎస్ ప్రగతి నివేదక సభను నిర్వహించనున్నారు.

– నీలగిరి, సెప్టెంబర్ 30

### ప్రగతి సన్నాహక సమావేశం

మంత్రి కేటీఆర్ రాక సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఎన్జీ కళాశాల మైదానంలో ప్రగతి నివేదన సభ నిర్వహిస్తున్నది. సభ విజయవంతం చేసేందుకు ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి శుక్రవారం లక్ష్మీ గార్డెన్‌లో నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. వార్డుకు ఇద్దరు నుంచి ముగ్గురు ముఖ్య నాయకులతో కమిటీలు వేశారు. గ్రామాల్లో సర్పంచ్, ఎంపీటీసీతో కలిపి కమిటీలు వేసి జన సమీకరణ ఏర్పాట్లపై చర్చించారు. సభ స్టేజీ ఏర్పాట్లను నల్లగొండ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి పర్యవేక్షిస్తున్నారు.



నల్లగొండ పట్టణంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్

### వేగంగా ప్రారంభోత్సవాల కార్యక్రమాలు

నల్లగొండ పట్టణ సుందరీకరణలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల నేపథ్యంలో మిగిలి ఉన్న పనులను శరవేగంగా చేపడుతున్నారు. మర్రిగూడ బైపాస్ నుంచి క్లాక్‌టవర్ సెంటర్ మీదుగా బస్టాండ్ వరకు రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్, గ్రీనరీ పనులను ముమ్మరం చేశారు. మర్రిగూడ జంక్షన్ నుంచి బస్టాండ్ వరకు సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి చేయడంతో విద్యుత్ కాంతులతో రోడ్లు ధగధగ మెరుస్తున్నాయి. డివైడర్లు, రోడ్లకు ఇరువైపులా ఫుట్‌పాత్‌కు రంగులు, డ్రైనేజీ పనులను మున్సిపల్ కమిషనర్ రమణాచారి దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. నల్లగొండ అభివృద్ధి ఫలాలు ప్రజలకు తెలిసేలా హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. క్లాక్‌టవర్ నుంచి బస్టాండ్ వరకు మొక్కలు నాటేందుకు సిద్ధం చేశారు.

# రేపు సూర్యాపేటలో ఐటీ హబ్ ప్రారంభం

- పాత కలెక్టరేట్ భవనంలో ఏర్పాట్లు
- రూ.577.77 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- పర్యటన ఏర్పాట్లపై సమీక్షించిన మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : సూర్యాపేట జిల్లా కేంద్రంలో రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్ సోమవారం పర్యటించనున్నారు. మంత్రి జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో పాత కలెక్టరేట్ భవనంలో ఏర్పాటు చేస్తున్న ఐటీ హబ్‌ను ప్రారంభించడంతోపాటు రూ.577.77 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. సూర్యాపేట పట్టణంలో నలుదిక్కులా నిర్మితమైన భవనాలతో పాటు శంకుస్థాపనలు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇమాంపేట సమీపంలో రూ.20కోట్లతో నిర్మించిన 384 డబుల్ బెడ్రూం ఇండ్లను లబ్ధిదారులకు అందించనున్నారు. పాత మున్సిపల్ కార్యాలయం వద్ద రూ.4కోట్లతో నిర్మించిన కమర్షియల్ కాంప్లెక్స్, జమ్మిగడ్డ పుల్లారెడ్డి చెరువు సమీపంలో రూ.118 కోట్లతో నిర్మించిన మురుగు నీటి శుద్ధి కేంద్రం, ఇమాంపేట వద్ద రూ.2కోట్లతో ఏర్పాటు చేసిన మానవ మల వ్యర్థాలతో ఎరువుల తయారీ కేంద్రం, రూ.2కోట్లతో నిర్మించిన ధోబీఘాట్‌లను మంత్రులు ప్రారంభిస్తారు. అలాగే రూ.30కోట్లతో చేపట్టనున్న రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. ప్రారంభించబోయే భవనాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే పనులు జరుగుతున్నాయి. ప్రారంభోత్సవాలతోపాటు పట్టణంలో ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లపై మంత్రి జగదీశ్‌రెడ్డి శనివారం సమీక్షించారు. అలాగే జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ ఆయా ప్రాంతాలకు వెళ్లి పరిశీలించారు. ప్రారంభోత్సవాల సందర్భంగా మంత్రులకు ఘన స్వాగతం పలికి భారీ ర్యాలీలు చేపట్టేందుకు బీఆర్ఎస్ నాయకులు సమాయత్తమవుతున్నారు. బీఆర్ఎస్ శ్రేణులు, స్థానిక ప్రజలు పాల్గొని మంత్రి కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ పిలుపునిచ్చారు.

# నల్లగొండ చరిత్రలో నిలిచేలా ఐటీ హబ్ నిర్మాణం

- ఇప్పటికే 16 కంపెనీల్లో 2200 మందికి ఉద్యోగాలు
- రానున్న రోజుల్లో మరింత మందికి ఉపాధి అవకాశాలు
- నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



నల్లగొండ ఐటీ హబ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, మున్సిపల్ కమిషనర్ రమణాచారి

నీలగిరి, సెప్టెంబర్ 30 : నల్లగొండ జిల్లా ప్రజల చిరకాల వాంఛ అయిన ఐటీ హబ్ నిర్మాణం చరిత్రలో నిలిచేలా పూర్తి చేసినట్లు, సోమవారం ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేస్తున్నట్లు నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి తెలిపారు. ఐటీ హబ్ పనులను మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డితో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ అక్టోబర్ 2న నల్లగొండ పట్టణంలో సుమారు రూ.912 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు చేస్తారని, ఇప్పటికే పూర్తి చేసిన పనులను ప్రారంభిస్తారని అన్నారు. మర్రిగూడ బైపాస్ వద్ద 118 కోట్ల రూపాయలతో చేపట్టిన డివైడర్స్, లైటింగ్, జంక్షన్ అభివృద్ధి పనులు ప్రారంభిస్తారని తెలిపారు. రూ.87 కోట్లతో చేపట్టే అంతర్గత రోడ్ల పనులకు శంకుస్థాపనలు అక్కడే చేస్తారని చెప్పారు. అనంతరం ఎన్జీ కళాశాల సమీపంలో రూ.8.05 కోట్లతో చేపట్టే వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్, ఫ్రూట్స్, ఫ్లవర్ మార్కెట్ పనులు ప్రారంభిస్తారని తెలిపారు. అక్కడి నుంచి క్లాక్‌టవర్ సెంటర్‌కు చేరుకొని రూ.234 కోట్లతో చేపట్టనున్న కళాభారతి, ఉదయసముద్రం ట్యాంక్ బండ్, వల్లభరావు చెరువు నెక్లెస్ రోడ్, ఐటీ హబ్ నుంచి ఉదయ సముద్రం వరకు ట్యాంక్‌బండ్ రోడ్డు, చాయా, పచ్చల సోమేశ్వర దేవాలయాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. 216 కోట్ల రూపాయలతో యూజీడీ పనులకు, రూ.56 కోట్లతో పట్టణంలో మిగిలి పోయిన ప్రాంతాలకు తాగునీరు పనులు, ఆరు సూట్లతో ఆర్‌అండ్‌బీ అతిథి గృహం, కార్యాలయం, రూ.36 కోట్లతో ఎన్జీ కళాశాల అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారని చెప్పారు. నల్లగొండ నియోజకవర్గాన్ని సీఎం కేసీఆర్ దత్తత తీసుకోవడంతో రూ.1300 నుంచి 1400 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. అన్ని పనులను సంవత్సరం నుంచి రెండేండ్లలో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. సాయంత్రం ఎన్జీ కళాశాల ప్రాంగణంలో ప్రగతి నివేదన సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అభిమన్యు శ్రీనివాస్, పార్టీ నాయకులు బకరం వెంకన్న, జమాల్ ఖాద్రీ, రావుల శ్రీనివాస్ రెడ్డి, సందినేని జనార్దన్‌రావు ఉన్నారు.

### ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

మంత్రి కేటీఆర్ పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు. మర్రిగూడ బైపాస్, ఐటీ హబ్, వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ పనులు, ఎన్జీ కళాశాల భవనాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ పట్టణంలో ఐటీ హబ్ ప్రారంభం కావడంతో యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రగతి నివేదన సభ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ కేవీ రమణాచారి, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.



సూర్యాపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

# మంత్రి కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి

**బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్**

సూర్యాపేట టౌన్, సెప్టెంబర్ 30 : సూర్యాపేట జిల్లా కేంద్రంలో సోమవారం రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. జిల్లా మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితో కలిసి రూ.517 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని తెలిపారు. బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 2న రూ.118కోట్లతో చేపట్టిన ఎస్టీపీ ప్లాంట్‌ను, రూ.2కోట్లతో చేపట్టిన ఈఎస్టీపీ ప్లాంట్, ఐటీ హబ్‌ను ప్రారంభించడంతోపాటు రూ.316కోట్లతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను, రూ.30కోట్లతో నిర్మించే కాల్వలు, సీసీ డ్రైనేజీ పనులు, రూ.4కోట్లతో చేపట్టనున్న ఇతర పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల సూర్యాపేటకు వచ్చి మెడికల్ కళాశాల, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ఎస్పీ, కలెక్టర్ కార్యాలయాలను ప్రారంభించారన్నారు. కొద్ది రోజులకే మంత్రి కేటీఆర్ వచ్చి మిగిలిన కార్యక్రమాలను ప్రారంభించడం ఆనందంగా ఉన్నదని తెలిపారు. 60 ఏండ్లలో జరుగని అభివృద్ధిని మంత్రి జగదీశ్‌రెడ్డి తొమ్మిదిన్నరేండ్లలోనే చేసి చూపించారని అన్నారు. రెండు సార్లు ఓటు వేసి గెలిపించిన ప్రజల రుణం తీర్చుకునేందుకు రూ.7వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. అక్టోబర్ 2న ఉదయం 11గంటలకు జిల్లాకు రానున్న మంత్రి కేటీఆర్‌కు భారీ బైక్ ర్యాలీతో ఘన స్వాగతం పలుకనున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల అనంతరం పార్టీ బహిరంగ సభలో ప్రసంగిస్తారని చెప్పారు. మంత్రి కేటీఆర్ పర్యటనపై విస్తృత ప్రచారం చేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములై రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి, జగదీశ్‌రెడ్డి మంత్రి అవుతారని, మరింత అభివృద్ధి చేసుకోవచ్చని అన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, పట్టణ ప్రధాన కార్యదర్శి బూర బాలసైదులు గౌడ్, నాయకులు గోవర్ధన్, నాగయ్య, రాపర్తి శ్రీనివాస్, ఆనంద్ పాల్గొన్నారు.